సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



తల్లిదండ్రులను విస్మరిస్తే చర్యలు

తల్లిదండ్రుల సంరక్షణను విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ హెచ్చరించారు. - 8లో



సైన్స్‌తోనే సమగ్ర అభివృద్ధి

సైన్స్‌తోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 8లో



రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో..

మెయిన్ రోడ్డు నుంచి ఆత్మకూరు(ఎం) లోకి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. - 9లో

న్యూస్‌రీల్

21న కళాకారుల ఎంపిక పోటీలు

భువనగిరి : జాతీయ యువజనోత్సవాల సందర్భంగా ఈ నెల 21వ తేదీన భువనగిరిలో జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి అధికారి ధనుంజయనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారు రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన కళాకారులను జనవరి 12నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. జానపద నృత్యం, జానపద గేయాలు, వ్యాసరచన, పోస్టర్‌మేస్టర్ మేకింగ్, వక్తృత్వం, ఫొటోగ్రఫీ, సామూహిక, వ్యక్తిగత పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 20లోపు జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 8309992451, 8374333378 నంబర్లను సంప్రదించాలన్నారు.

యాదాద్రి ఈఓగా ఐఏఎస్‌ను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈఓగా ఐఏఎస్ అధికారిని నియమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి ఆలయ ఈఓ, వైటీడీఏ వైస్ చైర్మన్, దేవాదాయ కమిషనర్ రిటైర్డ్ అయినప్పటికి వారినే కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. దేవస్థానం అభివృద్ధి కోసం కేటాయించిన నిధులపై నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలని కోరారు. నూతనంగా ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, నాయకులు పేరబోయిన పెంటయ్య, పేరబోయిన బంగారి, ఆరె పుష్ప, భాగ్యమ్మ, మూనుకుంట్ల నర్సమ్మ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు వెల్లంకి విద్యార్థి



రాపోలు లింగస్వామి

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన రాపోలు లింగస్వామి జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చే నెలలో చెన్నైలో జరగనున్న జాతీయస్థాయి (సౌత్‌జోన్) యూనివర్సిటీ హాకీ పోటీల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ జట్టు తరఫున ఆడనున్నాడు. ఎన్జీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న లింగస్వామి.. ఇటీవల నల్లగొండలో తెలంగాణ పరిధిలోని పది యూనివర్సిటీలకు నిర్వహించిన పోటీల్లో లింగస్వామి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. లింగస్వామిని సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎర్రోళ్ల లక్ష్మమ్మ, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రవ్వ అనసూయ వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

ఫిషర్‌మెన్ జిల్లా కమిటీ ఎన్నిక



చైర్మన్ ధర్మరాజు, వైస్ చైర్మన్ జానకిరాములుకు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర చైర్మన్

యాదగిరిగుట్ట : జిల్లా ఫిషర్‌మెన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా భువనగిరికి చెందిన సామల ధర్మరాజు, వైస్ చైర్మన్‌గా యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన జిల్లా జానకిరాములు నియమితులయ్యారు. వీరికి రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ నియామక ఉత్తర్వుల జారీ చేశారు. నూతన కమిటీని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్, జిల్లా అధ్యక్షుడు బండారు నారాయణ, సైదాపురం నాయకులు దుంబ్బల వెంకటరెడ్డి, శిఖ ఉపేందర్ తదితరులు అభినందించారు.

ఆటకు అందలం!



స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రాయగిరి రెవెన్యూ పరిధిలో కేటాయించిన ప్రభుత్వ స్థలం

భువనగిరిలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

- పది ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- స్థలం కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- డీపీఆర్ సిద్ధం చేస్తున్న అధికారులు
- సాకారం కానున్న క్రీడాకారుల కల

సాక్షి, యాదాద్రి : సరైన క్రీడా మైదానాలు, పరికరాలు లేక ఆటలకు దూరం అవుతున్న విద్యార్థులు, యువతకు త్వరలోనే ఆ సమస్య తీరనుంది. రోడ్ల వెంట వాకింగ్‌కు చేసే ఇబ్బందులు తప్పనున్నాయి. స్విమ్మింగ్ పూల్, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలు, అథ్లెటిక్స్ ట్రాక్‌లతో కూడిన మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియం త్వరలో భువనగిరిలో ఏర్పాటు కానుంది. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం భువనగిరికి మంజూరు చేసిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం పది ఎకరాల స్థలం కేటాయించింది. డీపీఆర్ రూపొందించే పనిలో అధికారులు నిమగ్నం అయ్యారు.

రెండేళ్ల క్రితం కేంద్రాన్ని కోరిన కోమటిరెడ్డి

జిల్లా కేంద్రంలో మల్టీపర్సర్ స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేయాలని భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్పందించిన కేంద్రం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మంజూరు చేసింది.ఇందుకోసం 10 ఎకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కలెక్టర్‌ను ఆదేశించింది. కానీ, రెండేళ్లు గడిచినా స్థలం కేటాయింపు జరుగలేదు.

తొలి సంతకం చేసిన మంత్రి

మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అవసరమైన 10 ఎకరాల స్థలం ఫైల్‌పై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తొలి సంతకం చేశారు. రూ.9.50 కోట్ల విలువ చేసే స్థలాన్ని స్టేడియం కోసం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ హన్మంతు కె.జెండగే, రెవెన్యూ అధికారులు రాయగిరి, గూడూరు, ముత్తిరెడ్డిగూడెం శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. అయితే అంతిమంగా భువనగిరి శివారులోని రాయగిరి రెవెన్యూ పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 259లో పది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని యువజన, క్రీడల శాఖకు కేటాయించారు.

స్టేడియంలో ఏర్పాటు చేయనున్నవి..

నూతనంగా నిర్మించే మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ పూల్, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలు, అథ్లెటిక్స్ ట్రాక్‌లు రానున్నాయి. క్రీడాకారులకు క్రీడా సామగ్రి, వసతి సౌకర్యం కలగనుంది. ఇందుకు సంబంధించి అధికారులు డీపీఆర్ రూపొందిస్తున్నారు. డీపీఆర్ ఆధారంగా కేంద్రం నిధులు కేటాయించనుంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ పథకంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ రెండేళ్ల క్రితం మంజూరైంది.

క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం



భువనగిరి పట్టణ శివారులో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పది ఎకరాల స్థలం కేటాయించింది. రూ.9.50 కోట్లు విలువ చేసే స్థలాన్ని మంజూరు చేసిన రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీగా ఉన్నప్పుడు స్పోర్ట్స్ కాంప్లెక్స్ మంజూరు చేయించిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికు కృతజ్ఞతలు. స్టేడియం ద్వారా భువనగిరితో పాటు జిల్లాలోని క్రీడాకారులకు లబ్ధి చేకూరుతుంది. దశాబ్దాల కల సాకారం కానుంది.

– కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, భువనగిరి

గిరిజనుడికి దక్కిన గౌరవం

- శాసనసభ ప్యానల్ స్పీకర్‌గా నేనావత్ బాలునాయక్
- తొలిరోజు అసెంబ్లీ సమావేశాల్లో అధ్యక్షత వహించిన దేవరకొండ ఎమ్మెల్యే



బాలునాయక్

దేవరకొండ : నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మరో కీలక పదవి దక్కింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి గెలిచిన ఏకైక గిరిజన ఎమ్మెల్యే నేతావత్ బాలునాయక్ శాసనసభ ప్యానల్ స్పీకర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఎవరికీ దక్కని ప్యానల్ స్పీకర్ పదవి దేవరకొండ ఎమ్మెల్యేకు దక్కడం విశేషం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శనివారం ప్యానల్ స్పీకర్లను ప్రకటించారు. మొత్తం నలుగురు ప్యానల్ స్పీకర్లను ప్రకటించగా అందులో ఉమ్మడి జిల్లా నుంచి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఒకరు. కాగా శాసనసభకు సాధారణంగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్ అధ్యక్షత వహిస్తారు. అయితే సభ జరుగుతున్న క్రమంలో వారిద్దరూ.. సభలో లేనిపక్షంలో ప్యానల్ స్పీకర్ అధ్యక్షత వహిస్తారు. అసెంబ్లీ సమావేశాల మొదటి రోజే ప్యానెల్ స్పీకర్లను స్పీకర్ నియమించడం ఆనవాయి తీ. కాగా.. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అసెంబ్లీ సమావేశాల తొలిరోజు సభకు కొద్దిసేపు అధ్యక్షత వహించడం విశేషం.

విధేయతకు పట్టం

బాలునాయక్‌కు అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ పదవి దక్కడం కాంగ్రెస్ పార్టీపై ఆయన చూపిన విధేయతకు గౌరవంగా ప్రజలు భావిస్తున్నారు. దేవరకొండ మండలం సూర్యతండాకు చెందిన బాలునాయక్ రాజకీయ ప్రస్థానం 1995నుంచి మొదలైంది. దేవరకొండ మార్కెట్ చైర్మన్‌గా, రెండుసార్లు జెడ్పీటీసీగా, ఉమ్మడి నల్లగొండ జెడ్పీ చెర్మన్‌గా పని చేశారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లో ఓటమి పాలయ్యారు. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్‌పై గెలుపొందారు.

విదేశాల్లో చేనేత వస్త్రాలకు డిమాండ్

- ఎన్‌ఐఎంఎస్‌ఎం గోలి స్వరూప



ఆసు యంత్రాన్ని పరిశీలిస్తున్న గోలి స్వరూప

మోత్కూరు : జిల్లాలోని చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు విదేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో స్మాల్ మీడియం డైరెక్టర్ ఆఫ్ జనరల్ (ఎన్‌ఐఎంఎస్‌ఎం) గోలి స్వరూప పేర్కొన్నారు.మోత్కూరులోని ఇక్కత్ చేనేత హ్యాండ్లూమ్ క్లస్టర్, వస్త్ర విక్రయ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. కార్మికులతో మాట్లాడి వృత్తిలో ఎదురవుతున్న సమస్యలు, ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కత్ క్లస్టర్ ద్వారా చేనేత ప్లస్, చేతి వృత్తుల నైపుణ్యం పెంచి జీవనోపాధి కల్పించి వారి ఆర్థిక అసమానతలను తొలగించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఉత్పత్తులు పెంచి యువత అభిరుచులకు అనుగుణంగా వస్త్రాల డిజైన్స్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత క్లస్టర్ సంఘం నాయకులు మంచె గోవర్ధన్, పాశికంటి లక్ష్మీనర్సయ్య, కొక్కుల సత్యనారాయణ, వేముల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన జడ్జి జయరాజు, చిత్రంలో న్యాయమూర్తులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి క్రైం : డిసెంబర్ 30న నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జయరాజు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం జిల్లా కోర్టులో సమావేశమై లోక్‌అదాలత్‌పై సమీక్షించారు. లోక్‌అదాలత్‌తో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని, అందుకోసం సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. కేసులు పరిష్కరిస్తే తద్వారా కక్షిదారుల్లో మార్పు రావడమే కాకుండా సమాజ శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో సుమారు 4,700 కేసులు రాజీపడదగినవిగా గుర్తించామని, వాటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. భూ వివాదాలకు సంబంధించి 12 కేసులు ఉన్నట్లు అదనపు కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతిదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఏపీపీఓలు పద్మజ, ఖాజా నిజాముద్దీన్ , అవినాష్, ట్రాఫిక్ సీఐ మధుసూదన్, ఇన్స్‌పెక్టర్ మల్లయ్య, న్యాయ సహాయ న్యాయవాదులు జైపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి తులసీ దళాలతో అర్చించారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహనసేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం ముఖ మండపంలో అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన గావించారు. సాయంత్రం జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు. రాత్రి శ్రీస్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

మాటిచ్చారు.. మరవద్దు!

- మోత్కూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సామేల్ హామీ
- ఎన్నికల ప్రచారంలో వాగ్దానం
- నియోజకవర్గం, రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపుతో చిగురిస్తున్న ఆశలు

మోత్కూరు : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు మోత్కూరు రెవెన్యూ డివిజన్ అస్త్రంగా ప్రచారాన్ని హోరెత్తించాయి. అధికారంలోకి వస్తే మోత్కూరును రెవెన్యూ డివిజన్ చేస్తామని హామీలు ఇచ్చాయి. ఏ ప్రభుత్వం వచ్చినా మాట నిలబెట్టుకుంటారని ప్రజలు విశ్వసించారు. అయితే తుంగతుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ ఎమ్మెల్యేగా గెలుపొందగా.. రాష్ట్రంలోనూ 'హస్తం' అధికారంలోకి రావడంతో మోత్కూరు రెవెన్యూ డివిజన్‌పై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటాలు

మోత్కూరు రెవెన్యూ డివిజన్ కోసం అఖిలపక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గత కొంతకాలంగా పోరాటాలు నిర్వహించారు. జిల్లా, రాష్ట్ర ఉన్నత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ సైతం ఆందోళన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో అఖిలపక్షం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలస్యం చేయకుండా డివిజన్ ఏర్పాటుపై చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ డివిజన్‌తోనే పూర్వ వైభవం

ఒకప్పుడు తాలూకా కేంద్రంగా ఉమ్మడి రాష్ట్రంలో మోత్కూరు గుర్తింపు పొందింది. మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, మోటకొండూర్ మండలాలను కలుపుతూ మోత్కూరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతాల ప్రజలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ డివిజన్ చేయడం వల్ల పాలన ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంది. అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ మారుమూల గ్రామం నుంచి భువనగిరికి సుమారు 80కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో దూరభారంతో పాటు ఖర్చులు పెరిగి ప్రజలపై ఆర్థిక భారం పడుతుంది. ఐదు మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్ చేస్తే పాలనా సౌకర్యం ఏర్పడుతుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందని మేధావులు పేర్కొంటున్నారు. తద్వారా మోత్కూరుకు పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న మందుల సామేల్ (ఫైల్)

'మోత్కూరు రెవెన్యూ డివిజన్ ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం. ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తున్నారు.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా'

- అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మందుల సామేల్ ప్రజలకు ఇచ్చిన హామీ

హామీ నెరవేరుస్తా



ఎన్నికల సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుంటా. ప్రధానంగా మోత్కూరు కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసే విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకువెళతా. గతంలో కూడా మోత్కూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం పోరాడాను. అఖిలపక్షం చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు మద్దతు పలికాను. మాట మీద ఉంట.

– మందుల సామేల్, ఎమ్మెల్యే, తుంగతుర్తి

ప్రజల ఆకాంక్షను గుర్తించాలి



మోత్కూరు ప్రాంత ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందనే విశ్వాసం ఉంది. ప్రజల డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించాలి. ఉద్యమానికి నాయకత్వం వహించిన మందుల సామేల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కావడం, అధికార పార్టీ అండగా ఉండటంతో ఆశ ఏర్పడింది. ఇప్పటికే ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

– అవిశెట్టి అవిలుమల్లు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

శ్రీకాంతాచారి పేరు పెట్టాలి



తెలంగాణ మలిదశ తొలి అమరుడు శ్రీకాంతాచారి స్వగ్రామం మోత్కూరు మండలం పొడిచేడు. జిల్లా, రాష్ట్రానికైనా శ్రీకాంత్‌చారి పేరు పెట్టలేదు. కనీసం గుర్తింపు తేలేకపోయారు. శ్రీకాంతాచారి త్యాగం వృథా కాకుండా మోత్కూరు ప్రాంతానికి గుర్తింపును ఇవ్వాలి. శ్రీకాంతాచారి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి ఆయన స్వంత మండలానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి.

– తీపిరెడ్డి సోమిరెడ్డి, లోక్‌సత్తా ఉద్యమ నాయకుడు

మాట నిలబెట్టుకోవాలి



రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మోత్కూరును రెవెన్యూ డివిజన్ చేసి మాటనిలబెట్టుకోవాలి. లేనిపక్షంలో మళ్లీ ఆందోళన బాట పడుతాం. మోత్కూరు రెవెన్యూ డివిజన్ కోసం గత ప్రభుత్వాల హయాంలో అనేక ఉద్యమాలు నిర్వహించాం. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాల ద్వారా కోరాం. ఈ ప్రాంత ప్రజల కలను సాకారం చేయవలిసిన బాధ్యత నూతన ప్రభుత్వంపై ఉంది.

– బుర్ర శ్రీనివాస్‌గౌడ్, బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు

ఆర్థికంగా బలోపేతం కావాలి

- డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



నల్లగొండలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్ : నాబార్డు సహకారంతో ప్రాథమిక సహకార సంఘాలు నిర్వహించే మల్టీ సర్వీస్ సెంటర్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సూచించారు. శనివారం డీసీసీబీలో జిలా సహకార బ్యాంకు మేనేజర్‌లు, బ్రాంచీల మేనేజర్లు, సహకార సంఘాల సీఈఓలకు మల్టీ సర్వీస్ సెంటర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు యాభై సహకార సంఘాల్లో మల్టీసర్వీస్ సెంటర్లను నాబార్డ్ మంజూరు చేసిందన్నారు. ఒక శాతం వడ్డీతో రుణాలను ఇస్తున్నందున సంఘాలు సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకురావాలన్నారు. గోదాముల నిర్మాణం, మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ వైద్య సేవలు తదితర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసుకుని సంఘాలు ఆర్థికంగా పుంజుకోవాలని సూచించారు. సెంటర్‌ల ఏర్పాటుకు రుణాలను ఇచ్చేందుకు నాబార్డు 2026 వరకు గడువును పెంచిందని తెలిపారు. సమావేశంలో ఎంఎస్‌సీ రాష్ట్ర కోఆర్డినేటర్ షరీఫ్, ఏజీఎం బ్రిజేష్,, సతీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి : జహంగీర్

మోత్కూరు : బీజేపీ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పిలుపునిచ్చారు. శనివారం మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం) మండలాల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మోత్కూరులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ సంపదలను అమ్ముతుందని ఆరోపించారు.రైల్వే, ఖనిజ సంపద, ఎల్ఐసీ, బీఎస్‌ఎన్‌ఎల్ లాంటి అనేక ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేట్ పరం చేసిందని విమర్శించారు. మరోవైపు మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ ప్రజల మధ్య అనైక్యతను సృష్టిస్తుందని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేషం, మండల కార్యదర్శులు గుండు వెంకటనర్సు, వేముల భిక్షం, బుర్రు అనిల్, పట్టణ కార్యదర్శి కూరపాటి రాములు, వల్లంభట్ల శ్రీనివాస్‌రావు, బుగ్గయ్య, చంద్రయ్య, రాంరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో కలిసి భూదాన స్థూపాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



హెలిపాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భూదాన్‌పోచంపల్లి : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 20న భూదాన్‌పోచంపల్లికి రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌ను శనివారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అదే విధంగా పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్‌ను పర్యవేక్షించారు. అనంతరం గ్రామీణ పర్యాటక కేంద్రం, వినోబాభావే మందిరాన్ని, భూదాన స్థూపం, భూదానోద్యమ చరిత్రకు సంబంధించిన ఫొటో గ్యాలరీని ఆయన పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, తహసీల్దార్ వీరాభాయి, ఆర్‌అండ్‌బీ ఈఈ శంకరయ్య, డీఈ సుగేందర్, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, వినోబాభావే సేవా సమితి నాయకులు కొయ్యడ నర్సింహ, ఏలే భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంజీయూ పీజీ 3వ సెమిస్టర్ టైం టేబుల్ విడుదల

ఎంజీయూ(నల్లగొండ రూరల్): మహాత్మా గాంధీ యూనివర్సిటీ పీజీ 3వ సెమిస్టర్ టైంటేబుల్‌ను శనివారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మిర్యాల రమేష్ విడుదల చేశారు. డిసెంబరు 29 నుంచి జనవరి 10 వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'మైహోం'లో పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మేళ్లచెరువు : సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమలోని సున్నపురాయి గనుల్లో శనివారం పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడారు. పరిశ్రమ ఎల్లప్పుడు వాతావరణ పరిరక్షణ, భద్రత చర్యల్లో ముందుటుందని పేర్కొన్నారు. అనంతరం పరిశ్రమ ఉద్యోగులకు, పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ ,పర్సనల్ డీజీఎం నాగేశ్వరరావు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : రైతులు సమగ్ర వ్యవసాయం చేస్తూ సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త నరేష్ అన్నారు. శనివారం ఆత్మకూరు (ఎస్) మండల పరిధిలోని కందగట్ల గ్రామంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్స్ విద్యార్థులు నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాంతమ్మ, రైతులు సుధాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రమేష్, సురేందర్ రెడ్డి, రామచంద్రు, మహేష్, యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు మహేష్, అభిలాష్, సందీప్, చరణ్, నాగారం, ప్రణీత్, సతీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోనీ కేంద్రీయ విద్యాలయంలో శనివారం ప్రదర్శించిన ఒడిస్సీ శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రతి ఏటా నిర్వహించే విద్యార్థుల్లో భారత దేశ శాస్త్రీయ నృత్యంపై ఆసక్తిని పెంచేలా కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయాల్లో రూట్స్ 2 రూట్ కార్యక్రమం నిర్వహిస్తోంది. నల్లగొండ పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం నందు ఒడిశాకు చెందిన నృత్య కళాకారిణి శోమృత మండల్ విద్యార్థులకు శాస్త్రీయ నృత్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుబ్బల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తులో యువత చిత్తు!

- కోదాడలో దగ్గుమందు దందా
- వైద్యుల సిఫారసు లేకుండానే కాఫ్ సిరప్‌ల విక్రయాలు
- సులువుగా లభ్యమవుతుండడంతో మత్తుకోసం వాడుతున్న యువత
- నూట యాభై రూపాయల సీసా నాలుగు వందలకు అమ్మకం



కోదాడ : మత్తులో యువత చిత్తవుతోంది. మార్కెట్‌లో సలువుగా లభ్యమవుతున్న దగ్గుమందును విరివిగా సేవిస్తూ ఒళ్లు గుల్ల చేసుకుంటోంది. కోదాడ కేంద్రంగా ఔషధ దుకాణాల యజమానులు, వాటిలో పనిచేస్తున్న వర్కర్స్ రూ. లక్షల్లో ఈ దందా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. రూ.150 విలువ చేసే ఈ మందు సీసాలను నాలుగు నుంచి ఐదు వందల వరకు అమ్ముతున్నారని సమాచారం. వీటిని బిల్లులు లేకుండా తెప్పిస్తుండంతో పైకి కనపడకుండా తెరచాటున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

వీరే కీలకం..

కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న ఓ రిటైల్‌షాపు, అదే రోడ్డులో ఉన్న ఓ మెడికల్ ఏజెన్సీ ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. వీరివద్ద ఈ దగ్గుమందు దొరకుతుందని కొందరికి మాత్రమే తెలుస్తుంది. రెగ్యులర్ కస్టమర్లుగా మారిన యువకులు దుకాణం ముందుకు రాగానే వీరు గుట్టుచప్పుడు కాకుండా అందిస్తుంటారు. సంవత్సరం క్రితం కోదాడ మండల పరిధిలో నల్లబండ గూడెం వద్ద ఈ దగ్గుమందును కొందరు ఇంజనీరింగ్ విద్యార్థులకు అమ్ముతుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. కానీ అమ్మిన వ్యాపారులపై ఎటువంటి కేసు నమోదు చేయలేదు. దీంతో వీరు తమ దందాను అక్కడి నుంచి కోదాడకు మార్చి కొనసాగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

అసలు ఏమిటీ ఈ దగ్గుమందు ?

అనారోగ్యంతో దగ్గు వస్తున్న వారికి వైద్యులు ఈ దగ్గు మందును రాస్తుంటారు. దీన్ని వైద్యుడి ప్రిస్క్రిప్షన్ ఉంటేనే అమ్మాల్సి ఉంటుంది. ఈ మందులో కొడిన్‌పాస్ఫేట్ అను మత్తును కలిగించే రసాయనం ఉంటుంది. దగ్గు లేస్తున్న వారికి ఇది మత్తును కలిగించి దానినుంచి ఉపశమనం కలిగిస్తుంది. దీన్ని కొంత మంది యువకులు మత్తుకోసం విపరీతంగా వాడుతున్నారు. వీరే ఈ దందా రాయుళ్లకు కాసులు కురిపిస్తున్నారు. నూటయాభై రూపాయల విలువైన ఈసిరప్‌ను 3నుంచి నాలుగు వందలకు అమ్ముతున్నా వీటికి అలవాటు పడినవారు కొనుగోలు చేస్తున్నారని సమాచారం. వీటితో పాటు నొప్పుల కోసం వాడే ట్రెమడాల్ మాత్రలు కూడా డాక్టర్ల సిఫార్సు లేకుండానే అమ్ముతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇరవై ఏళ్లుగా చక్రం తిప్పుతూ..

కోదాడలో జరుగుతున్న మెడికల్ దందా వెనుక ఓ పెద్ద తలకాయ అన్నీ తానై చక్రం తిప్పుతున్నట్లు పలువురు మెడికల్ షాపుల యజమానులే అంటున్నారు. తనిఖీలకు వచ్చే అధికారులు ముందస్తుగా ఆయనకు సమాచారం ఇచ్చి రావడం, ఎక్కడ తనిఖీలు జరిగినా ఆయన ప్రత్యక్షం కావడం పరిపాటిగా మారిందనే విమర్శలు ఉన్నాయి. దందారాయుళ్లకు, అధికారులకు మధ్య బేరాలు కుదర్చడంలో, ఎంత పెద్ద కేసునైనా నీరుగార్చడంలో ఆయన దిట్ట అని, గడిచిన 20 ఏళ్లుగా కోదాడలో ఆయనే చక్రం తిప్పుతున్నాడని సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రజాప్రతినిధికి దగ్గరగా ఉండి హల్‌చల్ చేసినట్లు పలువురు దుకాణదారులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కోదాడలో జరుగుతున్న మెడికల్ దందాపై దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

దగ్గుమందులను కొంత మంది మత్తు మందుగా వాడుతున్నారని ఫిర్యాదులు రావడంతో వాటిని నిషేధించారు. అలాంటి మందులను ఎవరైనా అమ్మినా, నిల్వ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఏ మందుల దుకాణంలోనైనా అమ్మితే మాకు సమాచారం ఇవ్వండి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

– సురేందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట జిల్లా

సైన్స్‌తోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యం



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

రామన్నపేట: సైన్స్‌తోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భారత ప్రభుత్వం జనవరి నెలలో నిర్వహించే ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా హైదరాబాద్ ఐఐసీటీ ఆధ్వర్యంలో శనివారం రామన్నపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఐఐసీటీ ఆధ్వర్యంలో వృథానీటి నిర్వహణ, పంట పురుగుల నివారణ పద్ధతులు, మెగ్నీషియం బ్యాటరీ, పేపర్ ఫోల్డింగ్ మైక్రోస్కోప్ తదితర ఇన్నోవేషన్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. శాస్త్రవేత్తల విజయవంతమైన పరిశోధనల ఫలితంగా దేశం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. కరోనావంటి కఠోరమైన విపత్తును అధిగమించ గలిగామని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరగడానికి పరిశోధనలే కారణమని వివరించారు. విద్యార్థులు బాల్యం నుంచే సైన్స్‌పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. కష్టమనుకోకుండా ఇష్టపడి చదివితే విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించగలరని వివరించారు. ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి తాను విద్యను అభ్యసించిన పాఠశాల ఆవరణలో చిన్ననాటి స్నేహితులతో కలిసి మొక్కలను నాటి నీళ్లు పోశారు. అనంతరం తాను చదువుకున్న సమయంలో పాఠశాలను నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కార్యక్రమంలో సీని యర్ శాస్త్రవేత్తలు వత్సలరాణి, కె.రాజేందర్‌రెడ్డి, వెంకటమోహన్, జిల్లా సైన్స్‌అధికారి భరణికుమార్, మండల విద్యాధికారి శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి , జ్యోతి మదర్‌థెరిసా ఉపాధ్యాయులు శేషాచారి, సుదర్శన్‌రెడ్డి, జరీనాబేగం, విజయ, రాణి, సైదుల్ రెడ్డి, సేవసాధు, జ్యోతి పాల్గొన్నారు.



రామన్నపేట: ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

తల్లిదండ్రుల సంరక్షణను విస్మరిస్తే చర్యలు

- సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ ఛైర్మన్ జగన్నాథరావు

చౌటుప్పల్ : తల్లిదండ్రుల ఆస్తులను అనుభవిస్తూ వృద్ధాప్యంలో వారి సంరక్షణను విస్మరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ ఛైర్మన్ జగన్నాథరావు తెలిపారు. ఆస్తులను అనుభవించడం హక్కు అయితే, తల్లిదండ్రుల సంరక్షణ మన బాధ్యత అని సూచించారు. డివిజన్ పరిధిలోని చౌటుప్పల్, నారాయణపురం, వలిగొండ, రామన్నపేట మండలాలకు చెందిన పలువురు తల్లిదండ్రుల నుంచి అందిన ఫిర్యాదులపై శనివారం ట్రిబ్యునల్ కార్యాలయంలో ఆయన విచారణ నిర్వహించారు. ఇరువురిని పిలిచి కేసులపై వాదనలు విన్నారు. కొన్ని కేసులను తదుపరి విచారణకు వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను చిన్నతనంలో తల్లిదండ్రులు ఏ విధంగా చూసుకునేవారో గుర్తుచేసుకోవాలన్నారు. జీవితాలను ధార పోసి తమ బిడ్డలను ప్రయోజకులుగా తీర్చిదిద్దేది తల్లిదండ్రులు మాత్రమేనని తెలిపారు. వృద్ధాప్య దశలోని తల్లిదండ్రులను కన్నబిడ్డల మాదిరిగా చూసుకోవాలని కోరారు. ఆస్తులను తమ పేరిట మార్చుకున్నాము, ఇక మమ్మల్ని ఎవరూ ఏమి చేయలేరని అనుకోవడం పొరపాటన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ పట్టించుకోకుంటే సంబంధిత ఆస్తులన్నీ తిరిగి వెనక్కి తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు తమ తీర్పులను ఉల్లంఘిస్తే పోలీస్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రిబ్యునల్ మెంబర్, సీనియర్ న్యాయవాది ముత్యాల సత్తిరెడ్డి, సెక్షన్ అధికారులు సురేంద్ర శర్మ, ప్రియాంక, తదితరులు ఉన్నారు.



కేసులను విచారిస్తున్న ట్రిబ్యునల్ ఛైర్మన్ జగన్నాథరావు

మద్యం మత్తులో దాడి.. ఒకరికి గాయాలు

హుజూర్‌నగర్ : మద్యం మత్తులో దాడి చేయగా ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన హుజూర్ నగర్‌లో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడేనికి చెందిన శ్రీను తన బంధువులతో కలిసి శుక్రవారం రాత్రి పట్టణంలోని ఒక మద్య దుకాణం వద్ద మద్యం తాగుతున్నాడు. అదే దుకాణంలో పట్టణానికి చెందిన జక్రయ్యా కూడా తన బంధువులతో మద్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో అతడిని వారించినందుకు శ్రీనుపై క్వాటర్ బాటిల్‌తో దాడి చేయగా గాయమైంది. వెంటనే అతడిని స్థానిక ఏరియా హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయించారు. బాధితుడు శ్రీను తమ్ముడు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



గాయపడిన రమేశ్, మాధవి దంపతులు

చింతపల్లి : రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలో చోటు చేసుకుంది. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన రావుల రమేశ్, మాధవి దంపతులు. వీరు కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. శనివారం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో చింతపల్లి మండల పరిధిలోని మైసమ్మ దేవాలయం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై ఉన్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బేతవోలులో రెండు ఇళ్లలో చోరీ

- రూ.7.52లక్షల నగదు, వెండి, బంగారు ఆభరణాల అపహరణ

చిలుకూరు: గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బేతవోలు గ్రామానికి చెందిన షేక్ మల్సూర్ కుటుంబ సభ్యులు శుక్రవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లారు. మల్సూర్ ఇంటి సమీపంలో నివాసముంటున్న దొంగరి నరసింహారావు హుజూర్‌నగర్‌లోని ఓ రైస్ మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. నరసింహారావు భార్య శుక్రవారం ఉదయం పుట్టింటికి వెళ్లింది. సాయంత్రం నర్సింహారావు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లాడు. గమనించిన దుండగులు వీరి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. మల్సూర్ ఇంట్లో రూ.7లక్షల నగదు, రెండు తులాల బంగారం, పది తులాల వెండి చోరీ చేశారు. నరసింహారావు ఇంట్లో కూడా రూ.52 వేల నగదు, తులం బంగారం, 10 తులాలు వెండి ఆభరణాలు ఎత్తుకుపోయారు. నరసింహారావు మిల్లు నుంచి శనివారం తెల్లవారుజామున ఇంటికి రాగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితులు చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలంకు చేరుకుని విచారణ చేశారు. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పులి వెంకటేశ్వర్లు తెలిపారు. చోరీ జరిగిన రెండు ఇళ్లు కూడా బెల్లు షాపులు కావడంతో తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.



బేతవోలులో చోరీ జరిగిన ఇంట్లో విచారణ చేస్తున్న పోలీసులు

గంజాయి సేవిస్తున్న యువకుడి అరెస్ట్

తుంగతుర్తి: గంజాయి సేవిస్తున్న యువకుడిని శుక్రవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బ్రహ్మమురారీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన కడారి గణేష్ ఇటీవల గంజాయికి బానిసగా మారాడు. గణేష్ తరచూ హైదరాబాద్‌లోని దూళిపేటకు వెళ్లి అపరిచిత వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తుంగతుర్తికి వచ్చి కుటుంబ సభ్యులకు అనుమానం రాకుండా గంజాయి సేవిస్తుండేవాడు. శుక్రవారం రాత్రి తుంగతుర్తి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గంజాయి సేవిస్తుండటంతో పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. గణేష్ వద్ద 250 గ్రాముల గంజాయి ప్యాకెట్ లభించినట్లు సీఐ తెలిపారు. గణేష్‌ను విచారించగా ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి రూ.1000 చెల్లించి గంజాయి ప్యాకెట్ కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. శనివారం అతడిని తహసీల్దార్ యాద గిరిరెడ్డి హాజరు పర్చి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బ్రహ్మమురారీ

భైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరి దుర్మరణం



మహిబెల్లి (ఫైల్)

హాలియా : ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన షేక్ మహిబెల్లి(53) పాలెం వద్ద ఉన్న వజ్రతేజ రైస్ మిల్లులో రోజువారీ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం మహిబెల్లి పని కోసం వజ్రతేజ రైస్ మిల్లు వద్దకు వెళ్లాడు. పని ముగించుకొని రాత్రి బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఇబ్రహీంపేట స్టేజీ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అతడిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఇబ్రహీంపేట స్టేజీ వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు పర్యవేక్షించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

కారు ఢీకొని..

సూర్యాపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని 65వ జాతీయ రహదారిపై పిల్లలమర్రి స్టేజీ వద్ద శనివారం చోటుచేసుకుంది. సూర్యాపేట పట్టణానికి చెందిన సయ్యద్ జానీ(58) సైకిల్‌పై పిల్లలమర్రి వైపు వెళ్తున్నాడు. చందన నర్సింగ్ కళాశాల వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో జానీకి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సయ్యద్ సర్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సాయిరాం తెలిపారు.

మట్టపల్లిలో శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శనివారం స్వామివారికి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూల విరాట్‌స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం చేశారు. లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధానాలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తుమాటి లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, అంజనేయ చార్యులు పాల్గొన్నారు.

ఇరుకు గదితో ఇబ్బంది

- సూర్యాపేట పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో కుర్చీలు పట్టని పరిస్థితి



సూర్యాపేట కలెక్టరేట్‌లో డీపీఆర్‌ఓ కార్యాలయానికి కేటాయించిన గది

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నూతనంగా ప్రారంభించిన సూర్యాపేట జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా పౌరసంబధాల శాఖ కార్యాలయానికి చిన్న గదిని కేటాయించడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఈ శాఖకు కలెక్టరేట్‌లో జీ 13 గదిని కేటాయించారు. ఈ గదిలో జిల్లా అధికారితో పాటు సిబ్బంది విధులు నిర్వహించవలసి ఉంది. ఇరుకు గదిలో కనీస కుర్చీలు పట్టే పరిస్థితి లేదు. ఈ శాఖతో సంబంధం ఉన్న ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా వ్యక్తులతో పాటు వృద్ధ కళాకారులు, జిల్లా సాంస్కృతిక సారథి బృందాల సభ్యులు నిత్యం కార్యాలయానికి వస్తుంటారు. ఇక్కడ కూర్చోడానికి స్థలం లేకపోవడంతో బయట నిలబడవలసి వస్తుందని, కలెక్టరేట్‌లో మరో గదిని కేటాయించాలని వారు కోరుతున్నారు.

హైనా దాడిలో లేగదూడ మృతి



బిలా వ్యవసాయ క్షేత్రంలో హైనా పాదముద్రలు

నూతనకల్ : హైనా దాడిలో లేగదూడ మృతిచెందింది. ఈ ఘటన నూతన్‌కల్ మండల పరిధిలోని కొత్త తండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కొత్తతండాకు చెందిన వాంకుడోతు బిలా తన వ్యవసాయ క్షేత్రంలో పశువులను కట్టి వేసి ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లే సరికి లేగదూడ కనిపించ లేదు. పరిసరాలను వెతకగా మృతి చెంది ఉంది. సమీపంలో పులి కాలిముద్రలను పోలిన నమూనాలు ఉండటంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ నరేష్ వెంటనే అటవీ శాఖ అధికారులను రప్పించగా వారు పరిశీలించి హైనా పాదముద్రలుగా గుర్తించారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ అధికారి వెంకటేశ్వర్లు, మురళీ పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

వలిగొండ : ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వలిగొండ మండలంలోని సంగెం గ్రామానికి చెందిన దుబ్బ శ్రీకాంత్ (24) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇతను కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన శ్రీకాంత్ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకున్నాడు. వ్యవసాయ పనులకు వెళ్లిన కుటుంబ సభ్యులు తిరిగి వచ్చే సరికి శ్రీకాంత్ దూలానికి వేలాడుతూ కనిపించాడు. చుట్టూపక్కల వారి సహాయంతో అతడిని కిందకు దింపే సరికి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

పాల దిగుబడికి బహువార్షిక పశుగ్రాసాల సాగు కీలకం

- సూర్యాపేట జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు

కోదాడరూరల్ : పాడి పరిశ్రమ అభివృద్ధికి పశుగ్రాసాల సాగు కీలకమని సూర్యాపేట జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంటలో రాష్ట్రీయ కెమికల్స్, ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. గర్భకోశ వ్యాధి కలిగిన గేదెలు, ఆవులకు చికిత్స నిర్వహించి దూడలకు నట్టల మందును తాగించారు. పశువుల్లో వచ్చే సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ టీకాలు వేయించాలని సూచించారు. ఇక రైతులు దమకున్న సాగు భూమిలో పాడి కోసం కొంత భూమిని కేటాయించుకొని అధికపాల దిగుబడినిచ్చే పశుగ్రాసాలను సాగు చేపడితే పచ్చి మేతతో కొరత తీరుతుందన్నారు. బహువార్షిక పశుగ్రాసాలనిచ్చే గడ్డిజాతులైన సూపర్‌నేపియర్, దశరథగడ్డి వంటి వాటిని సాగు చేసుకుంటే ఐదు సంవత్సరాల వరకు ఇబ్బంది ఉండదని తెలిపారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిని కూడా చేపడితే లాభాల బాటలో పయనించవచ్చని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధినేని లీలాఅప్పారావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబు, రాష్ట్రీయ కెమికల్స్, ఫెర్టిలైజర్స్ సీనియర్ మేనేజర్ ప్రవీణ్, మార్కెటింగ్ మేనేజర్ రాకేష్, వైస్ ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య ఉన్నారు.



రెడ్లకుంటలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

మాజీ సర్పంచ్ బైక్ దగ్ధం

రామన్నపేట : గుర్తుతెలియని వ్యక్తులు మాజీ సర్పంచ్ బైక్‌ను దగ్ధం చేశారు. ఈ ఘటన రామన్నపేట మండలం లక్ష్మాపురంలో చోటు చేసుకుంది. గ్రామ మాజీసర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు బత్తుల కృష్ణగౌడ్ రోజు మాదిరిగానే తన బైక్‌ను శుక్రవారం రాత్రి ఇంటి ముందు పార్క్‌చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి దుండగులు బైక్‌కు నిప్పంటించి పారిపోయారు. అలికిడి విని బయటకు వచ్చిన కృష్ణగౌడ్ దగ్ధమవుతున్న బైక్‌పై నీళ్లు చల్లి మంటలను ఆర్పాడు. డాగ్‌స్క్వాడ్, క్లూజ్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు. దండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, గుత్తా నర్సింహారెడ్డి, గోదాసు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు.



సంఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం